సాక్షి వనపర్తి

గురువారం । 26 । జనవరి । 2023



నేడు జోగుళాంబ వైభవం

అలంపూర్ జోగుళాంబ అమ్మవారు గురువారం నిజరూప దర్శనం ఇవ్వనున్నారు.

వివరాలు 8లో ▸



జోరుగా ఉల్లి వ్యాపారం

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి క్వింటా గరిష్టంగా రూ.1,610, కనిష్టంగా రూ.950 ధర పలికింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /16.3

వాతావరణం

ఉదయం, రాత్రి సమయాల్లో చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

తపాల ఉద్యోగుల నిరసన



వనపర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో పోస్టాఫీసుల్లో వివిధ క్యాడర్లలో పని చేస్తున్న ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఏఐపీఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, అదనపు కార్యదర్శి అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ జిల్లాకేంద్రంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలవారీగా పొందాల్సిన వేతనాలు సకాలంలో అందక కుటుంబ పోషణ భారంగా మారడంతో పాటు ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలను కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. యూనియన్ ప్రతినిధులు రేణుక, యుగేందర్, రామారావు, గణేషన్, దామోదర్, విజయ్ పాల్గొన్నారు.

కోర్టు భవనాల నిర్మాణానికి స్థలం పరిశీలన

వనపర్తి క్రైం: జిల్లా కోర్టుల సముదాయం నిర్మాణానికి సర్వేనంబర్ 200లో ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని బుధవారం ఆర్కిటెక్చర్ ఇంతియాజ్, ఆర్‌అండ్‌బీ అధికారి దానయ్య, ఏఈ తదితరులు పరిశీలించారు. భవనాల నమూనా, స్థలం అనుకూలత, పరిసర ప్రాంతాలపై ప్రభుత్వానికి, హైకోర్టుకు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్, కార్యదర్శి విజయభాస్కర్, పీపీ చంద్రశేఖర్‌రావు, ఉత్తరయ్య తదితరులు ఉన్నారు.

'రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, రేయిన్‌బో హోటల్ అధినేత పి.విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం 500 మంది అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయడంతో పాటు గడపగడపకు వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల అధ్యక్షులు వాకిటి శ్రీహరి, జి.మధుసూధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, ఎన్‌ఆర్‌ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, అయ్యూబ్‌ఖాన్, తులసిరాజ్, పరమేష్, శ్రీను, గణేష్, మహేందర్‌రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.



వేడుకలకు ముస్తాబు

సమీకృత కలెక్టరేట్‌కు విద్యుద్దీపాలంకరణ



రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో సమీకృత కలెక్టరేట్ భవనం

- 10 స్టాళ్లు, 200 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్

వనపర్తి: గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని బుధవారమే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలను రంగురంగుల విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. కరోనా ప్రభావంతో రెండేళ్ల పాటు ఉత్సవాలను నామమాత్రంగా నిర్వహించిన అధికారులు ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి వేడుకలు జరుగుతున్నందున భవనాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతోఅలంకరించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వివిధ శాఖలు సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేసేందుకు 10 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే లబ్ధిదారులకు వాహనాలు, కుట్టుమిషన్లు, మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. అలాగే పోలీసులు కవాతు నిర్వహించేందుకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ప్రాక్టీస్ చేశారు. కలెక్టరేట్‌లోనే పరేడ్ నిర్వహించి కలెక్టర్, ప్రజాప్రతినిధులకు గౌరవ వందనం చేయనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 9.55 గంటలకు ఎస్పీ కలెక్టరేట్‌కు చేరుకుంటారు.
- 9.59 గంటలకు కలెక్టర్ వేదిక వద్దకు చేరుకుంటారు.
- 10 గంటలకు గౌరవ వందనం స్వీకారం, జాతీయ పతాకావిష్కరణ చేస్తారు.
- 10.15 నుంచి 10.30 వరకు కలెక్టర్ సందేశం, జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపిస్తారు. అనంతరం స్వాతంత్ర సమర యోధుల కుటుంబాలను సన్మానిస్తారు.
- 10.40 గంటల నుంచి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు.. వివిధ పథకాల లబ్ధిదారులకు వాహనాలు, కుట్టుమిషన్లు, చెక్కుల పంపిణీ, అనంతరం అతిథుల స్టాల్స్ సందర్శన, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు.



పరేడ్ ప్రాక్టీస్ చేస్తున్న పోలీసులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అధికారులు

దేశ భవిష్యత్ ఓటరు చేతిలోనే..



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి.. చిత్రంలో కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని.. మంచి పాలకుడిని ఎన్నుకునే హక్కు, దేశ భవిష్యత్‌ను నిర్ధారించే హక్కు ఓటరుకు మాత్రమే ఉందని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్ తరాలను సక్రమంగా ఉపయోగించుకోగలిగితే అభివృద్ధిలో దేశం ప్రథమస్థానంలో ఉంటుందన్నారు. యువతరం ఓటుహక్కు ప్రాముఖ్యతను తెలుసుకొని వినియోగించడంతో పాటు చుట్టుపక్కల వారికి ఓటు ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకొని ప్రతి ఎన్నికలోనూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని మన పాలకులను మనమే ఎన్నుకోవాలన్నారు. ఓటర్‌కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయటంతో దేశంలో ఒకేచోట ఓటు హక్కు కల్పించటం సాధ్యమవుతోందని తెలిపారు. ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాల అధ్యక్ష పాలన, ఓటు ప్రాధాన్యత గురించి ఆయన వివరించారు.

- కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ.. ఓటు ప్రాధాన్యత గురించి ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలని, జిల్లా ఓటరు జాబితా ప్రకారం 2,22,611 మంది పురుషులు, 2,20,183 మంది స్త్రీలు, ఏడుగురు థర్డ్ జెండర్లు, మొత్తం 4,42,801 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు కొత్త ఓటరు నమోదు 82 శాతం పూర్తయిందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ ఓటరు నమోదు చేసిన జిల్లాగా వనపర్తి నిలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఓటుహక్కు ప్రతిజ్ఞను ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు చేశారు. కొత్తగా ఓటుహక్కు పొందిన విద్యార్థిని, సీనియర్ ఓటరు విజయ్‌కుమార్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆశిష్ సంగ్వాన్, డి.వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, ఆయాశాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో..

వనపర్తి క్రైం: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం అవతరించడం ఓటుహక్కుతోనే సాధ్యమైందని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సునందిని అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల సమావేశ మందిరంలో ఆమె విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంతో ఉత్పత్తుల అభివృద్ధి

పెబ్బేరు: మానవ సమాజానికి ఉపయోగపడే **జీవాలు పెంపకంతో** ఉత్పత్తులు అభివృద్ధి చెందు**తాయని రాష్ట్ర వ్యవ**సాయశాఖ మంత్రి సింగిరెడ్డి **నిరంజన్‌రెడ్డి అన్నా**రు. బుధవారం పట్టణంలోని **వ్యవసాయ మార్కెట్**యార్డులో పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని ఆయన, కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూసారం పెంపొందించటంలో జంతువులు ప్రముఖ పాత్ర పోషిస్తాయని, బలవర్ధకమైన ఆహారం, ఆర్థికాభివృద్ధికి ప్రతి ఇంటి యజమాని, రైతులు పెరటి కోళ్లు, మేకలు, గొర్రెలు, పాడి పశువులు పెంచుకోవాలని సూచించారు. అలాగే వెటర్నరీ కళాశాల విద్యార్థులు మూగజీవాల స్థితిగతులు, రోగాలు, సంతానోత్పత్తి, మేలురకం జాతి గేదెలు, ఆవులు పుట్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వారం పాటు 21 గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేసి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పెబ్బేరు, చెలిమిళ్ల, కంచిరావుపల్లిలోని 1,200 పశువులకు నట్టల నివారణ మందులు, మరికొన్ని పశువులకు సాధారణ, శస్త్రచికిత్సలు అందించారు. పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి రవీందర్‌రెడ్డి, అసోసియేట్ డీన్ ఉదయకుమార్, నాగలక్ష్మి, పుర చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, ఎంపీపీ ఆవుల శైలజ, జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు కురుమూర్తియాదవ్, జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో ఉన్నతంగా రాణించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ భవనం, మండల రిసోర్స్ భవనం, సింగిల్‌విండో గోదాం, రంగ సముద్రంలో టూరిజంశాఖ బోటును ప్రారంభించారు. అనంతరం కేజీబీవీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల హయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని వసతులు కల్పించామని తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధిరంగాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సమాధానాలు చెప్పిన వారికి ప్రైజ్ మనీ ఇచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని విద్యార్థులు, నాయకులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, డీఈఓ రవీందర్, జీసీడీఓ శుభలక్ష్మి, ఎంఈఓ జయరాములు, తహసీల్దార్ అబ్రహంలింకన్‌పాల్గొన్నారు.



శ్రీరంగాపురం రంగసముద్రంలో బోటులో ప్రయాణిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

అర్హులందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఖిల్లాఘనపురం: అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, దళితబంధు తదితర సంక్షేమ పథకాలు అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని ఆగారంలో రూ.21 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభించడంతో పాటు రూ.24 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపనను అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఆగారం – కమాలోద్దీన్‌పూర్ రహదారిపై ఉన్న వంతెన నిర్మాణానికి త్వరలోనే ప్రభుత్వ అనుమతి తీసుకొస్తామని తెలిపారు. రెండోవిడత గొర్రెల పంపిణీకి ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే చర్యలు చేపడతారని చెప్పారు. పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, డీఈ ప్రమోద్, ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికే గుర్తింపు కార్డులు

- జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి వేణుగోపాల్

ఆత్మకూర్: భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు గుర్తింపు కార్డులు పొంది ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశమై మాట్లాడారు. భవన నిర్మాణం, టైలరింగ్‌లో నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు రోజుకు రూ.500 నగదు, భోజన సౌకర్యం కల్పించి శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. గుర్తింపుకార్డు ఉన్న కార్మికుడు సహజ మరణం పొందితే రూ.1.30 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.6.30 లక్షలు పరిహారం అందుతుందని, అలాగే కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.30 వేలు, ప్రసవానికి రూ.30 వేలు, కార్మికుడు అంగవైకల్యం పొందినా, ఆస్పత్రిలో నెలరోజులు చికిత్స పొందినా పరిహారం అందుతుందని వివరించారు. పరిహారం పొందేందుకు కార్మికులు సరైన ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించారు. కొత్త కార్మికులు మీ–సేవ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జతపర్చాలని సూచించారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి రఫీఖ్, కార్మికులు ఈదన్న, వెంకటన్న, శేఖర్, దేవన్న, బాలస్వామి, బాలన్న, కృష్ణయ్య, చిన్నయ్య, చంద్రయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

'కంటివెలుగు'కు విశేష స్పందన

- కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

వనపర్తి: రెండోవిడత కంటివెలుగుకు జిల్లాలో విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల ప్రత్యేక కంటివెలుగు శిబిరాన్ని ఆమె అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఆర్డీఓ పద్మావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎస్ శాంతికుమారి ఆదేశాల మేరకు జర్నలిస్టులకు ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సాయంత్రం శిబిరం ముగిసే సమయం వరకు 187 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 112 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారని కార్యక్రమ అధికారి డా. సాయినాథ్‌రెడ్డి తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్, డీపీఆర్‌ఓ రషీద్, జర్నలిస్టు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేయొద్దు

గోపాల్‌పేట: కంటివెలుగు శిబిరాలకు వచ్చే వారిని ఇబ్బందులకు గురిచేయకుండా పరీక్షలు చేసి పంపించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన మ ండల కేంద్రంతో పాటు తాడిపర్తి కంటివెలుగు శిబిరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడా రు. రోజూ నిర్దేశించిన మేర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, అ ద్దాలు అందించాలి సూచించారు.

నేరాల నియంత్రణపై దృష్టి

వనపర్తి క్రైం: వ్యవస్థీకృత నేరాలపై దృష్టి సారించడంతో పాటు అదుపు చేయడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజనీకుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు ఉన్నతాధికారులు, ఎస్పీలతో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కేసుల పరిష్కారానికి అధికారులు చూపుతున్న చొరవ, నేరస్తులకు శిక్షలు పడేలా తీసుకుంటున్న చర్యల గురించి ఎస్పీ అపూర్వరావు వివరించారు. ఏఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐ శ్రీనివాసాచారి, జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రాము, అతిక్ పాల్గొన్నారు.

ఎస్పీ కె.అపూర్వరావు బదిలీ

వనపర్తి క్రైం: ఎస్పీ కె.అపూర్వరావు నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మల్కాజిగిరి డీసీపీ రక్షితమూర్తి జిల్లా రానున్నారు. 2018, సెప్టెంబర్ 4న ఎస్పీగా కె.అపూర్వరావు బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో నాలుగు సంవత్సరాల నాలుగు నెలల పాటు విధులు నిర్వర్తించారు. గంజాయి, గుట్కా, ఇసుక అక్రమ రవాణా, రేషన్ బియ్యం పక్కదారిపై ఉక్కుపాదం మోపారు. నేరాల నియంత్రణలో తనవంతు పాత్ర పోషించి అందరి మన్ననలు పొందారు.



అపూర్వరావు



రక్షితమూర్తి

'పాలమూరు'పైనే నజర్..!

ప్రధాన రాజకీయ పార్టీల ఫోకస్ ఇక్కడే..

- క్యూ కట్టిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ
- ఉమ్మడి జిల్లా కేంద్ర బిందువుగా క్రియాశీలక రాజకీయాలు
- ఎవరికి వారు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..
- ఉత్సాహంలో ఆయా పార్టీల శ్రేణులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రధాన రాజకీయపక్షాలు పాలమూరుపైనే ఫోకస్ పెట్టాయి. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయా పార్టీలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలతో బీఆర్‌ఎస్.. మోదీ పాలనలో భారత్ వెలుగుతోందని, డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే తెలంగాణ ఎనలేని అభివృద్ధి సాధిస్తుందంటూ బీజేపీ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర జోష్‌తో కాంగ్రెస్ పునర్ వైభవాన్ని చాటేందుకు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల సంవత్సరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను కేంద్ర బిందువుగా చేసుకుని క్రియాశీలక రాజకీయాలకు ఆయా పార్టీలు శ్రీకారం చుట్టడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో పలు నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష నేతల విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

ప్రజాక్షేత్రం..అభివృద్ధి పనులు..సంక్షేమం

రాష్ట్రంలో హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా అధికార బీఆర్‌ఎస్ పోరు కార్యాచరణను అమలు చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో నేతలు నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటూనే అభివృద్ధి పనులు.. సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. దీంతో పాటు పెద్ద ఎత్తున పార్టీలో చేరికలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇదే క్రమంలో పార్టీకి చెందిన ముఖ్యనేతలు జిల్లాలో తరచుగా పర్యటిస్తూ శ్రేణుల్లో జోష్ పెంచుతున్నారు. సీఎం కేసీఆర్ ఈ ఏడాది మొదటి వారంలో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి రాగా.. ఇటీవల రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ నారాయణపేటలో పర్యటించారు. వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ త్వరలో మున్సిపాలిటీలో వార్డుల వారీగా పర్యటించేందుకు సమాయత్తమైనట్లు తెలుస్తోంది.

ప్రజాసం'గ్రామం' నుంచి..

రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో దూకుడుగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రధానంగా పాలమూరుపైనే దృష్టి పెట్టింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రెండోవిడత ప్రజాసంగ్రామ యాత్ర ఉమ్మడి జిల్లా పరిధిలోని అలంపూర్ జోగుళాంబ ఆలయం నుంచి మొదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. అప్పటి నుంచి బీజేపీకి చెందిన ముఖ్యనాయకులు తరచుగా జిల్లాలో ఎక్కడో చోటకు పర్యటనకు వస్తూనే ఉన్నారు. పార్లమెంట్ ప్రవాసీ యోజన కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే మహబూబ్‌నగర్‌లో పర్యటించారు. తాజాగా ఇటీవల బీజేపీ రాష్ట్రకార్యవర్గ సమావేశాలకు మహబూబ్‌నగర్ వేదికగా నిలవడం జిల్లాపై ఆ పార్టీ ఫోకస్ స్పష్టమవుతోంది. అధికార బీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చెబుతూనే రాజకీయ కార్యాచరణతో పాటు కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించేలా నేతలు ప్రత్యేక వ్యూహంతో ముందుకుసాగుతున్నారు. మరోవైపు బీజేపీ అగ్రనేతలైన ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలలో ఎవరో ఒకరు వచ్చే ఎన్నికల్లో పాలమూరు నుంచే బరిలో ఉంటారనే ప్రచారం ఊపందుకుంది. దీంతో ప్రధాన రాజకీయ పక్షాలతో పాటు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

జోడో జోష్‌తో..

కాంగ్రెస్ సైతం పాలమూరుపై దృష్టి సారించింది. చాప కింద నీరులా పలు నియోజకవర్గాల్లో జోరు పెంచింది. ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో జరిగిన దళిత, గిరిజన ఆత్మగౌరవ సభకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేతో పాటు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితర ముఖ్య నేతలు హాజరయ్యారు. సభకు భారీ ఎత్తున జనం రావడంతో శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అదేవిధంగా రాహుల్ జోడోయాత్ర జిల్లాలో విజయవంతం కావడంతో ఆ జోష్‌తో 'హాత్ సే హాత్ జోడో అభియాన్' పేరుతో మరోయాత్రకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం ప్రారంభం కానుండగా.. మార్చి 26 వరకు అంటే 60 రోజుల పాటు కొనసాగనుంది. జిల్లాకేంద్రాలతో పాటు మండలాల్లో ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హాత్ సే హాథ్ జోడో అభియాన్ ప్రారంభోత్సవంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. ఆ తర్వాత మండల పరిధిలో స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంచనున్నారు. ఇలా ఉమ్మడి పాలమూరు కేంద్రంగా ప్రధాన పార్టీలు పోటాపోటీగా కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ముందస్తు ఎన్నికలు ఖాయమనే ప్రచారం జోరుగా సాగుతోంది.

క్లుప్తంగా

చిన్నారిని చిదిమేసిన ట్రాక్టర్

ఆత్మకూర్: ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబలించింది. ఈ సంఘటన మండలంలోని జూరాలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్ననర్సింహులు, గోవిందమ్మ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు లాస్య(4) బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా వ్యవసాయ పనులకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో చిన్నారి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నర్సింహులు ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గని, యజమాని చింతలన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌గౌడ్ తెలిపారు. కాగా తల్లితండ్రుల రోదన పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాప చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ: యువకుడి దుర్మరణం

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొనగా యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ–2 రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లికి చెందిన చింతల సైదులు(26) అచ్చంపేట నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు పట్టణానికి వస్తుండగా అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ఢీకొన్నాయి. బైక్ వేగంగా బస్సును ఢీకొట్టడంతో యువకుడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. గోపాల్‌పేటకు చెందిన వెంకటయ్య(58), కుర్మయ్య స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శ్రీపురం వైపు నుంచి వచ్చిన ఆటో ఎదురెదురుగా జిల్లాకేంద్రంలోని ఎస్‌ఆర్ పెట్రోల్ పంపు వద్ద ఢీకొన్నాయి. ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక అంబులెన్స్‌లో చికిత్స కోసం తరలించగా వెంకటయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అటు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. గాయపడిన మరోవ్యక్తి కుర్మయ్య ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: అనుమానాస్పద స్థితిలో గాయపడి.. చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. హన్వాడ మండల కేంద్రానికి చెందిన బ్యాగరి శ్రీను ధర్మపూర్ వద్ద ఉన్న జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 24న పాఠశాల భవనం నుంచి కిందపడిపోయాడని, చికిత్స కోసం జనరల్‌ఆస్పత్రికి తరలించామని ప్రిన్సిపాల్ తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. అప్పటికే పరిస్థితి విషమించిందని వైద్యులు హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అయితే విద్యార్థి మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుమందు తాగి కార్మికుడి ఆత్మహత్య


కుర్మయ్య (ఫైల్)

పాన్‌గల్: పురుగుల మందు తాగి పారిశుద్ధ్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తెల్లరాళ్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కుర్మయ్య(47) మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

మక్తల్: కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని మంతన్‌గోడ్‌లో సుమలత (33) ఇంట్లో కుటుంబ కలహాలు ఉండటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త రఘు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

నేడు జోగుళాంబ వైభవం

- వసంత పంచమికి సిద్ధమైన అమ్మవారి ఆలయం
- నేడు భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్న అమ్మవారు
- హాజరుకానున్న సీఎం కుటుంబ సభ్యులు




ఆలయంలో విద్యుత్ అలంకరణలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో దేవస్థానం వారు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం రిపబ్లిక్ డే ఉండటం వల్ల అమ్మవారి ఆలయాన్ని 15వేల మంది దర్శించుకునే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

నిజరూప దర్శనం

ఉదయం 7:30 నుంచి పూజలు ప్రారంభమై 8:30 గంటలకు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. 9 గంటల నుంచి కట్టెలపేటలో ఊరేగింపు జాతర ప్రారంభమై 11గంటలకు పట్టణ ప్రజలు జోగుళాంబ ఆలయానికి చేరుకుని అభిషేకాలు, నిజరూప దర్శనం చేసుకుంటారు.

ముగింపు కార్యక్రమాలు



యాగశాలలో ఉదయం 8గంటలకు పూర్ణాహుతి, కుంకుమార్చన మండపంలో 8:50కి సహస్ర ఘటకలశ ఉద్వాసన, 9 గంటలకు అమ్మవారి నిజరూప దర్శనం, అభిషేకాలు ప్రారంభం. మద్యాహ్నం 2 గంటలకు కవాట బంధనం, 3 గంటలకు మహా నివేదన, దర్శనాలు, సాయంత్రం 4:30కు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర శాంతి కల్యాణం, 6:30కు ధ్వజ అవరోహనం, 7గంటలకు మహా మంగళహారతి, ఉత్సవ పరిసమాప్తి ఉంటుంది.

– ఆనంద్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

ప్రముఖుల రాక



ఆలయానికి పెద్ద ఎత్తున సామాన్య భక్తులతో పాటు ప్రముఖులు కూడా వస్తారు. రిపబ్లిక్ డే ఉండటంతో సీఎంకు బదులుగా వారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పలువురు ఐఏఎస్, సినీ నటులు, ఆధ్యాత్మిక ప్రవచనకారులు వస్తున్నారు.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

ఆకట్టుకునేలా ఉత్సవాలు



ఈ ఏడాది ఏర్పాట్లు మరింత సౌకర్యంగా చేశాం. భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ లైన్‌లో వెళ్లే చోట పెద్ద ఎల్‌ఈడీ టీవీలలో అమ్మవారి అభిషేకం, నిజరూప దర్శనం, వేడుకలు చూస్తూ వెళ్లేలా ఏర్పాట్లు ఉన్నాయి. మరోవైపు అదే సమయంలో నిజరూప దర్శనం ఫలితం పై బాచంపల్లి సంతోష్‌కుమర్ శాస్త్రి ప్రవచం, వేద ప్రవచనాలు వినేలా మైక్ సిస్టం, క్యూ లైన్‌లో ఉచిత ప్రసాదాలు, తాగునీరు, క్యాలెండర్ల పంపిణీ కూడా కల్పించాం.

– శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్

వైభవంగా అంజన్న బ్రహ్మోత్సవాలు

- నేడు స్వామి వారి రథోత్సవం
- భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిట


పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ధ్వజారోహణం కార్యక్రమాలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు రెండవ రోజు బుధవారం ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీసేవ, ప్రభోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి 10 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నారు.

ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిట

అంజన్న బ్రహ్మోత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అంతా కిటకటలాడుతోంది. ముఖ్యంగా స్వామి వారికి దానంగాలు పెట్టే వారు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ కమిటీ సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లను ఇప్పటికే సిద్ధం చేసింది. తాగు నీరు, విద్యుత్ లైట్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించారు.

వెలసిన దుకాణాలు

జాతరలో మిఠాయి, చెరుకు, గాజుల దుకాణాలతో పాటు చిన్న పిల్లల ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి. ఇప్పటికే భక్తులు జాతరలో టెంట్లు వేసుకున్నారు. జాతర స్పెషల్‌గా గద్వాల డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం వాహనంతో అధికారులు

కోస్గి: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా నుంచి ఓ వాహనంలో బుధవారం రాత్రి అక్రమంగా తరలించేందుకు లోడ్ చేసిన బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్, స్థానిక పోలీసులు కలిసి పట్టుకున్నారు. వాహనంలో 4.80 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. బియ్యాన్ని బాల్‌నర్సయ్య రేషన్ దుకాణానికి తరలించినట్లు డీటీ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ బురాన్, యజమాని చిన్న నర్సింహులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లైన వ్యక్తితో ఎఫ్‌బీలో పరిచయం

- తనకు ఎవరూ లేరంటూ చాటింగ్
- యువతి ఇంట్లోనే సహజీవనం
- భార్య ఫిర్యాదుతో బయటపడ్డ నిజం

ఉండవెల్లి: నాకు పెళ్లి కాలేదు.. నాకెవరూ లేరంటూ ఓ వ్యక్తి యువతితో ఎఫ్‌బీలో పరిచయం పెంచుకున్నాడు. యువతిని బలంగా నమ్మించి యువతి ఇంట్లోనే సహజీవనం పెట్టారు. తీరా ఆ వ్యక్తి భార్య మిస్సింగ్ కేసు పెట్టడంతో అసలు నిజం బయటపడింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బస్వాపురం చెందిన యువతికి ఏపీ రాష్ట్రం తాడిపత్రికి చెందిన దూదేకుల మాబుతో రెండేళ్ల క్రితం ఫేస్‌బుక్‌లో పరిచయడం ఏర్పడి, రోజూ చాటింగ్ చేసుకునేవారు. మాబు తనకు ఎవరూ లేరని, పెళ్లి కాలేదని, నువ్వంటే ఇష్టమని గట్టిగా నమ్మించాడు. ఆయన్ను నమ్మిన యువతి తరుచూ ఆయనకు కొంత నగదు కూడా ఆన్‌లైన్‌లో పంపించేది. కాగా గతేడాది నవంబర్‌లో బస్వాపురంకు మాబు వచ్చి, యువతి తల్లితో మాట్లాడి అక్కడే 45 రోజుల పాటు ఉన్నాడు. తాడిపత్రిలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో అసలు విషయం బయటపడింది. ఈ వ్యక్తి భార్య, పిల్లలు ఉన్నారు. భర్త చాలా రోజుల పాటు ఇంటికి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే క్రమంలో పోలీసులు అతని నగదు లావాదేవీలను పరిశీలించగా, యువతి పంపిన నగదుపై ఆరా తీశారు. ఈ నెల 7వ తేదీన గ్రామానికి తాడిపత్రి పోలీసులు చేరుకున్నారు. వారి ఇంటి వద్దకు వెళ్లి మాబుపై మిస్సింగ్ కేసు నమోదైందని, అతన్ని తీసుకెళ్తున్నామని చెప్పారు. నేను తిరిగి వస్తానని భయపడవద్దని యువతికి చెప్పి వెళ్లిపోయాడు. వెళ్లినప్పటి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో, యువతి ఆయనకు ఫోన్ చేసింది. మాబు తనకు పెళ్లైందని, పిల్లలు ఉన్నారని, నీ దారి నీదే.. నాదారి నాదే అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

హైవేపై యువకుడి దుర్మరణం

- రోడ్డుపై చిందరవందరగా శరీరభాగాలు


శివ (ఫైల్)

కొత్తకోట: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడుకుంట్ల మండలం పేరూర్ చెందిన గోవిందమ్మ, నాగన్న దంపతుల కుమారుడు శివ(25) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. శివ అక్క నాగేశ్వరమ్మ, బావ వెంకటయ్యలు పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్నారు. 23న శివ తన అక్క దగ్గరకు కొత్తకోటకు వచ్చాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై పిచ్చిపిచ్చిగా తిరిగేవాడు. మంగళవారం ఉదయం హైదరాబాద్ వెళ్తున్నానని తన అక్కతో చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడని నాగేశ్వరమ్మ తన భర్తకు ఫోన్ చేసి చెప్పింది. మంగళవారం అర్ధరాత్రి కొత్తకోట సమీపంలోని మదర్‌థెరిస్సా జంక్షన్ సమీపంలో హైవేపై వాహనం ఢీకొని వ్యక్తి దుర్మణం చెందాడని సమాచారం పోలీసులకు వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా గుర్తు పట్టలేని విధంగా శరీరభాగాలు ఉండడంతో పోలీసులు మృతదేహం ఫోటోలు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అనంతరం మృతదేహన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం వెంకటయ్య తన బావ మరిది శివకు ఫోన్ చేయగా కలవకపోవడంతో అనుమానం వచ్చి వనపర్తి మార్చురిలో గల మృతదేహం దగ్గరకు వెళ్లి చూసి ప్రమాదంలో మృతి చెందింది శివ అని గుర్తించాడు. మృతుడి బావ వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


శివరాణి(ఫైల్)

లింగాల: మండలంలోని సూరాపూర్‌కు చెందిన గాదం శివరాణి(28) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం చెందిన శివరాణికి మండలంలోని సూరాపూర్‌కు చెందిన మహేష్‌తో పదేళ్ల కిందట వివాహమైంది. మహేష్ మండల కేంద్రంలో మీసేవలో పని చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఈ నెల 20న విధులకు వెళ్లాడు. ఆ తర్వాత ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న భార్య పశుగ్రాసం పెంపకానికి ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగి అపస్మాక స్థితిలోకి పడింది. వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

రాజాపూర్: మండలలోని ముదిరెడ్డిపల్లి శివారులో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు. ముదిరెడ్డిపల్లి శివారులో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు కీమెన్ సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

అమ్రాబాద్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాచారాం కాలనీకి చెందిన ఉడ్తనూరి బీసయ్య బుధవారం మధ్యాహ్నం తన తమ్ముడు సైదులుతో పాటు మరో ముగ్గురితో కలిసి సమీపంలోని పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. వల ద్వారా చేపలు పట్టిన అనంతరం తమకంటే ముందుగానే వచ్చిన బీసన్న గోతి వద్ద కాళ్లు చేతులు శుభ్రం చేసుకుంటూ కనిపించాడు. మేము బయటకు వచ్చి చూసే సరికి కనిపించ లేదని అతను ఉన్న గోతిలో వెతికినా ఆచూకి లభించలేదని చెప్పారు. చెరువులోనే మునిగి ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. బీసయ్య తమ్ముడు సైదులు ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి గాలించారు. రాత్రి కావడంతో చెరువు వద్దకు చేరుకున్న అగ్నిమాపక వాహనం నీళ్లు తోడకుండానే తిరిగి వెళ్లి పోయింది. గల్లంతైన బీసయ్యకు భార్య అరుణ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

జడ్చర్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 20న తాడూరు మండలం పాపగల్ చెందిన వితంతు మహిళపై వెంకటేష్ లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు నాగర్‌కర్నూల్‌లో ఉన్న సోదరికి విషయం చెప్పింది. దీంతో బాధితురాలి సోదరి నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

జడ్చర్ల: కావేరమ్మపేటలో పశువుల కాపరిగా పనిచేస్తున్న శివకుమార్ ఈనెల 4వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడని ఫతేపూర్ చెందిన బంధువు వెంకటయ్య బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా స్థానిక పాతబజార్‌కు చెందిన కావలి శిరీష మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి శ్రీను పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోర్టును ఆశ్రయిస్తేనే న్యాయం

- కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి


సేవ్ జడ్చర్ల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: భూ కబ్జాదారుల నుంచి జడ్చర్లను కాపాడుకుందామని సేవ్ జడ్చర్ల పేరుతో వచ్చేవారం మున్సిపాలిటీ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచారం సమీపంలోని వెంకట్రాద్రి సీ బ్లాక్ భూ వివాదంలో ఎవరు తప్పుచేసినా శిక్షిస్తామని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రకటించటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వెంకట్రాద్రి సీ బ్లాక్‌లో ఇంతకుముందు ప్లాట్లు కొన్న వారంతా రావాలని, కోర్టును ఆశ్రయిస్తేనే న్యాయం లభిస్తుందని పిలుపునిచ్చారు. వివాదానికి సంబంధించి భూ రిజిస్ట్రేషన్ విషయంలో తప్పు చోటు చేసుకుందని తహసీల్దార్ అంగీకరించారని, ఆయన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ టౌన్‌షిప్, తిరుమల వెంచర్లలో బాధితులు మీకు ఫోన్ చేస్తే రండి సెటిల్ చేస్తామని అన్నారే తప్పా న్యాయం చేస్తామని అనలేదన్నారు. సెటిల్‌మెంట్ చేస్తాననటం ఎంత వరకు కరెక్ట్ అంటూ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నందున వెంకట్రాద్రి సీ బ్లాక్ భూ వివాదంకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించాలని సవాల్ విసిరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కబ్జాలకు పాల్పడుతున్నారని బహిరంగంగా తెలిసిపోయిందన్నారు. మున్సిపాలిటీలో ఇన్నేళ్లుగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టి ఎవరూ పన్ను కట్టడం లేదని, గతేడాది నెలల తరబడి ఫ్లెక్సీలు ఉన్నా వాటి గురించి పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అందుకు మున్సిపాలిటీ నుంచి హోర్డింగ్‌ల ఆదాయం ఏమి లేదని ఆర్టీఐ ద్వారా పొందిన సమాచారం తెలియజేశారు. సమావేశంలో నాయకులు అయ్యన్న, అనుపకృష్ణయ్య, అశోక్‌యాదవ్, లక్ష్మమ్మ, రాంప్రసాద్, శాగంటి రఘు పాల్గొన్నారు.

కన్నకొడుకే కాలయముడు

- రోకలిబండతో మోది తండ్రిని హత్య చేసిన తనయుడు
- నాగర్‌కర్నూల్ జిల్లా దొడ్లపల్లిలో ఘటన


కిష్టయ్య (ఫైల్)

చారకొండ: కొద్దికాలంగా అనారోగ్యంతోపాటు మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి కన్న తండ్రినే రోకలిబండతో మోది హత్య చేశాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. దొడ్లపల్లి గ్రామానికి చెందిన గొడ్డేటి కిష్టయ్య(67)కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అల్లాజీ ఆరు నెలలుగా అనారోగ్య సమస్యలతో పాటు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తండ్రీకొడుకుల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో తండ్రి కిష్టయ్య, కుమారుడు అల్లాజీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన అల్లాజీ క్షణికావేశంలో రోకలి బండతో తండ్రి తలపై గట్టిగా కొట్టడంతో కిష్టయ్య తలపగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ కల్యాణ్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు అల్లాజీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కిష్టయ్యకు భార్య లక్ష్మమ్మ, చిన్న కుమారుడు సత్తయ్య ఉన్నారు.

వేరుశనగ మిషన్‌లో పడి మహిళ మృతి


గంగమ్మ (ఫైల్)

కోడేరు: వేరుశనగ మిషన్‌లో ప్రమాదవశాత్తు పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తీగలపల్లి గ్రామానికి చెందిన గొల్ల గంగమ్మ(40) ఓ రైతు పొలంలో వేరుశనగ పంట మిషన్ పట్టే కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం పల్లీలను నూర్పిడి చేస్తుండగా.. ఆమె మెడకు ఉన్న తువ్వాల (టవల్) మిషన్ జాయింట్‌కు తగిలింది. తల మిషన్‌లో పడిపోగా.. తోటి కూలీలు అప్రమత్తమయ్యేలోగానే మొండం నుంచి తల తెగిపడింది. ఈ దృశ్యాన్ని చూసిన కూలీలు బోరున విలపించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త శ్రీనివాసులు, కుమారుడు ఉన్నారు.

రాష్ట్రానికి 2 రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు

- 13 పోలీసు ప్రతిభా పతకాలు కూడా
- కేంద్ర హోంశాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు కేంద్రప్రభుత్వం పతకాలను ప్రకటించింది. తెలంగాణకు 2 రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు, 13 పోలీసు ప్రతిభా పతకాలు లభించాయి. అదే సమయంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారాంకు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకం లభించింది. తెలంగాణలో విశిష్ట సేవలందించినందుకు అనిల్ కుమార్ (ఏడీజీ), బ్యాంగి రామకృష్ణ (అడిషనల్ కమాండెంట్, టీఎస్ఎస్పీ 12 బెటాలియన్)లకు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు లభించాయి. కాగా ఈ ఏడాది మరో 13 మంది అధికారులు పోలీసు ప్రతిభా పతకాలకు ఎంపికయ్యారు. తరుణ్ జోషి (వరంగల్ పోలీసు కమిషనర్), పేర్ల విశ్వ ప్రసాద్ (జాయింట్ పోలీసు కమిషనర్, స్పెషల్ బ్రాంచ్, హైదరాబాద్), గంగసాని శ్రీధర్ (ఏసీపీ, సైబర్ క్రై ం), పి.నర్సింహ (డీఎస్పీ, రీజినల్ ఇంటెలిజెన్స్), ఆర్.అరుణ్ రాజ్ (డీఎస్పీ, బేగంపేట్), జి.వెంకటేశ్వర్లు (ఇన్‌స్పెక్టర్, సిటీ స్పెషల్ బ్రాంచ్), ఎం.శ్రీధర్ రెడ్డి (ఇన్‌స్పెక్టర్, ఐటీ సెల్), ఎన్ఎస్ జైశంకర్ (ఏఆర్ఎస్ఐ, మూడో బెటాలియన్), కరుకొండ దయశీల (ఆర్ఐ, వరంగల్), జి.అచ్యుత రెడ్డి (ఏఏసీ గ్రేహౌండ్స్), ఎస్.రాందేవ్ రెడ్డి (ఇన్‌స్పెక్టర్, ఇంటెలిజెన్స్), వీర రామాంజనేయులు (ఏఆర్ ఎస్ఐ, ఇంటెలిజెన్స్), బి.వి.స న్యాసిరావు (ఇన్‌స్పెక్టర్, టీఎస్పీఎస్ హైదరాబాద్)లకు పోలీసు ప్రతిభా పురస్కారాలు దక్కాయి. ఈ పతకాలు సాధించిన పోలీసు అధికారులను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు.

'ఫైర్ సేఫ్టీ' లేకుంటే కొరడా!

బహుళ అంతస్తుల భవనాల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్

- హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా కఠిన చర్యలు
- ఫైర్‌సేఫ్టీపై ఉన్నతాధికారులతో కమిటీ
- అవసరమైతే ఫైర్‌సేఫ్టీ చట్టానికి సవరణలు
- మంత్రులు కేటీఆర్, తలసాని, మహమూద్ అలీ ఉన్నతస్థాయి సమీక్ష
- దక్కన్ మాల్‌లో మరణించిన ముగ్గురి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం



బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొన్న మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బహుళ అంతస్తుల భవనాల్లో అగ్నిప్రమాదాల నియంత్రణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రుల బృందం ఉన్నతాఅధికారులను ఆదేశించింది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర అన్ని ప్రధాన నగరాల్లోని బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసు కునే చర్యలకు సంబంధించి 'ఫైర్ సేఫ్టీ ఆడిట్' నిర్వహించాలని నిర్దేశించింది. అగ్నిమాపక శాఖకు ఆధునిక సామగ్రిని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రస్తుతం శాఖకు అవసరమైన అత్యవసర సామగ్రికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించింది. బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని మాపక చర్యలపై సందేహాలు తలెత్తిన నేపథ్యంలో బుధవారం మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ బీఆర్‌కేఆర్ భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అర్వింద్‌కుమార్, సునీల్‌శర్మ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. భవిష్యత్తులో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి విపత్తులు సంభవించకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ముగ్గురు బలైన నేపథ్యంలో ప్రభుత్వం ఈమేరకు చర్యలు చేపట్టింది. డెక్కన్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించింది.

డ్రోన్ సాంకేతికతను వినియోగించండి

మునిసిపల్ నిబంధనల ప్రకారం ఐదంతస్తులు, ఆపై నిర్మించే భవనాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు జరపడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాలలోని వ్యాపార, వాణిజ్య భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, ఎత్తైన అపార్ట్‌మెంట్లలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైతే ప్రస్తుతమున్న ఫైర్‌సేఫ్టీ చట్టాలను సవరించాలని చెప్పారు. హైదరాబాద్‌లో భారీగా నిర్మాణమవుతున్న బహుళ అంతస్తుల భవనాల ఫైర్ సేఫ్టీకి సంబంధించి డ్రోన్లు, రోబోటిక్ సాంకేతికతను వినియోగించుకునే అంశాలను పరిశీలించాలన్నారు. ఈ మేరకు పాశ్చాత్య దేశాలతోపాటు దేశంలోని ఇతర నగరాల్లో ఉన్న మెరుగైన పద్ధతులపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక సిబ్బందికి మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, వారిని నిష్ణాతులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా భవనాల యజమానులను కూడా భాగస్వాములను చేసుకునే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఇంకా జలమండలి ఎండీ దాన కిషోర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర , రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, హైదరాబాద్ కలెక్టర్ అమేయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం అయినందునే..

- నెలాఖరులోగా బీఆర్ఎస్‌లో చేరికకు ముహూర్తం
- వచ్చే నెలలో ఒడిశాలో బీఆర్ఎస్ బహిరంగ సభ
- ఒడిశా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా గిరిధర్ గమాంగ్!
- 'సాక్షి'తో ఒడిశా నేత శిశిర్ గమాంగ్



సాక్షి, హైదరాబాద్: త్వరలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరేందుకు సన్నద్ధమవుతున్న ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్, ఆయన కుమారుడు శిశిర్ గమాంగ్ బుధవారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2015లో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన తాను కొన్నేళ్లుగా ఒడిశా ప్రజలకు సేవలు అందించలేకపోతున్నందున పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పంపిన లేఖలో గిరిధర్ గమాంగ్ పేర్కొన్నారు. తన తండ్రితో పాటు తాను కూడా బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని, బీజేపీకి ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్‌ను భావిస్తున్నందున ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నామని గిరిధర్ గమాంగ్ కుమారుడు శిశిర్ గమాంగ్ వెల్లడించారు. బీఆర్ఎస్‌లో చేరికకు సంబంధించిన పలు అంశాలపై బుధవారం శిశిర్ గమాంగ్ 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. 'తొలుత ఈ నెల 23న బీఆర్ఎస్‌లో చేరాలనుకున్నా. కానీ కుదరలేదు. మరో రెండు మూడు తేదీలు పరిశీలనలో ఉన్నాయి. జనవరి నెలాఖరులోగా బీఆర్ఎస్‌లో చేరేందుకు అనువైన తేదీ కోసం చూస్తున్నాం. బీఆర్ఎస్ ఒడిశా శాఖ అధ్యక్షుడిగా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ నియమితులయ్యే అవకాశముంది. ఫిబ్రవరి 17న కేసీఆర్ జన్మదిన వేడుకలు, హైదరాబాద్ సభ ముగిసిన తర్వాత ఒడిశాలోనూ బీఆర్ఎస్ సభ నిర్వహించాలనే యోచనలో ఉన్నాం. మాతో పాటు ఒడిశాకు చెందిన సుమారు 15 మంది మాజీ ఎమ్మెల్యేలు, మరికొందరు ముఖ్య నేతలు కూడా బీఆర్ఎస్‌లో చేరే అవకాశముంది' అని శిశిర్ వెల్లడించారు.

సమర్థులకు అవకాశం లభించడంలేదు..

'సమర్థులైన నేతలకు బీజేపీలో అవకాశం లభించడం లేదు. వివిధ పార్టీల్లో ఉన్న క్రియాశీల నేతలతో పాటు పలు సంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నాం. మాజీ సీఎం గిరిధర్ గమాంగ్‌కు ఎస్సీ, ఎస్టీల్లో మంచి ఆదరణ ఉంది. ఒడిశాలో బీఆర్ఎస్ అడుగు పెడుతుండటంతో సమర్థులైన నేతలు, రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న వారికి మంచి వేదిక దొరుకుతుందని భావిస్తున్నాం. ఒడిశా రాజకీయాలు, సమస్యల గురించి కేసీఆర్‌కు ఉన్న అవగాహన వల్లే బీఆర్ఎస్‌పై మొగ్గు చూపుతున్నాం' అని శిశిర్ గమాంగ్ 'సాక్షి'కి చెప్పారు.

తొమ్మిదిసార్లు వరుసగా ఎంపీ..

కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన గిరిధర్ గమాంగ్ 1972 నుంచి 2004 వరకు 9 సార్లు వరుసగా ఎంపీగా ఎన్నికయ్యారు. లోక్‌సభ సభ్యుడిగా ఉంటూనే 1999 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ వరకు ఒడిశా 13వ ముఖ్యమంత్రిగా పని చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వం ఎదుర్కొన్న అవిశ్వాస పరీక్షలో చివరి నిమిషంలో పార్లమెంట్‌కు వచ్చి ఓటు వేయడంతో ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం కూలింది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన గిరిధర్ గమాంగ్ 2015లో బీజేపీలో చేరారు. బీజేపీ ఒడిశా కార్యదర్శిగా పనిచేసిన శిశిర్ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

పోలీసులకు 'ఆజాదీ కా అమృత్' పతకాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పోలీసులకు పతకాలు పంపింది. గణతంత్ర దినోత్సవ కానుకగా కేంద్రం ఈ పతకాలను అందజేస్తోంది. మువ్వన్నెల జాతీయ పతాకపు అంచున ధగధగలాడే వెండి పతకం ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ముందువైపు నాలుగు సింహాల బొమ్మ, వెనుక వైపు అశోక చక్రం ముద్రించి ఉన్నాయి. 'సత్యమేవ జయతే, 75వ స్వాతంత్ర్య దినోత్సవం' అన్న అక్షరాలు మెరుస్తున్నాయి. పతకం అడుగున 1947–2022 అని సంవత్సరాలు చెక్కి ఉన్నాయి. ఇప్పటికే ఈ పతకాలు రాష్ట్రంలోని అన్ని ఎస్పీ, సీపీ కార్యాలయాలు, ఇతర విభాగాల పోలీసులకు చేరాయి. డీజీపీ నుంచి సాధారణ కానిస్టేబుల్ వరకు అందరికీ ఈ పతకాలను జనవరి 26న అందజేయనున్నారు.



హైకోర్టు తీర్పుపై హర్షం

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి చెప్పారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కోవిడ్ కారణంగా గణతంత్ర దినోత్సవాన్ని జరపడం లేదని కోర్టుకు కుంటిసాకులు చెప్పేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి.. ఖమ్మం సభ సమయంలో కోవిడ్ గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై గౌరవం లేని బీఆర్ఎస్ ప్రభుత్వానికి కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని మల్లు రవి వ్యాఖ్యానించారు.

విద్యుత్ సంస్థల మనుగడకు ఏసీడీ చార్జీలు తప్పనిసరి

- కట్టకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేత: విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు



కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ పంపిణీ సంస్థల మనుగడ కోసం అడిషనల్ కన్‌జంప్షన్ డిపాజిట్ (ఏసీడీ)చార్జీలను తప్పక చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు కోరారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏసీడీ చార్జీలపై వినియోగదారులు ఆందోళనలు, పలు చోట్ల విద్యుత్ ఉద్యోగులను నిర్బంధించడం వంటివి చేయడం సమంజసం కాదన్నారు. వినియోగదారుల అపోహలను తొలగించే బాధ్యత ఈఆర్సీపై ఉందని చెప్పారు. సెక్షన్ 47 ఏపీ విద్యుత్ నియంత్రణ చట్టం 2003 రెగ్యులేషన్ నంబర్ 6 ప్రకారం వినియోగదారుల నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలకు ఏసీడీ చార్జీలు వసూలు చేసుకొనే బాధ్యత ఉందన్నారు. విద్యుత్ చట్టం నియమ నిబంధనలకు లోబడే వినియోగదారుడు గత సంవత్సరంలో వాడుకున్న యూనిట్ల సరాసరి నెలకు లెక్కించి రెండు నెలల డిపాజిట్‌ను ఏసీడీగా జనవరి బిల్లులో చూపించడం జరుగుతోందని తెలిపారు. ఈ డిపాజిట్ వినియోగదారుడి పేరిట విద్యుత్ సంస్థల వద్ద ఉంటుందని, ఈ మొత్తానికి సంస్థలు వడ్డీ చెల్లిస్తాయని చెప్పారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 7.16 లక్షల విద్యుత్ సర్వీసుల ద్వారా రావల్సిన రూ.305 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకే ఈ ఏసీడీ చార్జీలను వసూలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు రూ.35 వేల కోట్లు అదనంగా వెచ్చించి విద్యుత్‌ను కొనుగోలు చేశామని, అదేవిధంగా గత ఏప్రిల్‌లో బహిరంగ మార్కెట్‌లో రూ.3,800 కోట్లు అదనంగా వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా మెరుగైన విద్యుత్‌ను అందించామని తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుందని, వినియోగదారులు అర్థం చేసుకొని తప్పకుండా చార్జీలు చెల్లించాలని అన్నారు. లేనిపక్షంలో విద్యుత్ సర్వీసులకు సరఫరా నిలిపివేస్తామని శ్రీరంగారావు స్పష్టం చేశారు. హైదరాబాద్ పాతబస్తీలో సైతం విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



మహబూబ్‌నగర్ క్రైం: ప్రతి పోలీస్ స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయడం వల్లే నేరాలు నిరోధించడంతోపాటు న్యాయస్థానాల్లో శిక్షలు ఖరారు అవుతున్నాయని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శాంతిభద్రతల కోసం పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని, వివిధ సందర్భాల్లో రాష్ట్ర పోలీస్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. శాంతిభద్రతలపై సమీక్ష సమావేశం బుధవారం డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలపై ఎస్పీ మాట్లాడుతూ నేరాలు కట్టడి చేయడానికి నిరంతరం కృషి చేస్తూ నేరస్థులకు శిక్షపడేందుకు దర్యాప్తులో ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు కట్టడి కోసం డేంజర్ జోన్‌లలో వేగ నిరోధకాలు ఏర్పాటు చేశామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలు, రోడ్డు నిబంధనలు, బాల్య వివాహాలు, సైబర్ మోసాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీలు మహేష్, ఆదినారాయణ, రమణారెడ్డి, మధు, లక్ష్మణ్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తినీటి మట్టం 1,021 అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,140, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,050, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నాగర్‌కర్నూల్ రూరల్: కార్మికుల సమస్యలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ వీఓఏల ఉద్యోగులు స మస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఐకేపీ వీఓఏల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఫిబ్రవరి 9,10 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31న జిల్లా కేంద్రంలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షురాలు సుమలత, సుమతి, అంజనేయులు, మహేష్, పర్వతాలు పాల్గొన్నారు.

చెంచులకు డబుల్ బెడ్రూం ఇళ్లు



చిన్నాయపల్లి వాసులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వైద్యంభాస్కర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కొండలు, కొనలు, చెట్లు, పుట్టలు ఇవే వారి నివాసాలు. సామాజిక జన జీవనానికి, మనుషులకు దూరంగా ఏళ్ల తరబడి నివాసం ఉండటం చెంచులకు అలవాటు. 1970 లో చెంచులకు ఇందిరమ్మ ఇళ్లు కల్పించిన ప్రభుత్వం అవి పాతబడి కూలిపోవటంతో మరోసారి నిరాశ్రయులయ్యారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి వారిని యజమానులుగా చేయడమే కాక, వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చింది. మహబూబ్ నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం, చిన్నాయపల్లి, చౌదర్ పల్లి చెందిన సుమారు 70 మంది చెంచు కుటుంబాలు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మొదటి విడత పల్లెప్రగతిలో వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వారిని ఎమ్మెల్యే కోటా కింది చిన్నాయపల్లి, చౌదర్ పల్లి చెంచులకు ఇళ్లు ఇచ్చేందుకు అంగీకరించడమే కాకుండా, కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, వారికి ఇళ్లను కేటాయిస్తూ కలెక్టర్ వెంకట్రావ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఛత్రినాయక్ ద్వారా గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్‌కి కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తమకు అందరిలాగే ప్రభుత్వం ద్వారా ఇళ్లు రావడంపై రెండు గ్రామాల చెంచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకే జిల్లాలో ఇదే తరహాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హన్వాడ మండలం యారోన్‌పల్లిలో కూడా సుమారు 24 మంది చెంచులకు తన కోటా కింద ఇళ్లను కట్టిస్తున్నారు.

ఇథనాల్ కంపెనీ నుంచి ముప్పులేదు



కంపెనీ అనుమతి పత్రాలను చూస్తున్న లక్ష్మారెడ్డి

మరికల్: చిత్తనూర్ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ నుంచి ఎలాంటి ముప్పు లేదని జూరాల ఆర్గానిక్ ఫారమ్స్ అగ్రో ఇండస్ట్రీస్ కంపెనీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. కంపెనీ వద్ద బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొందరు వ్యక్తులు కంపెనీ గురించి నిజాలు తెలుసుకోకుండా ఆందోళనలు చేయడం సరికాదన్నారు. కేటాగిరి–ఏ పరిశ్రమలను ఏర్పాటు చేసే ముందు ప్రజాభిప్రాయ సేకరణ అవసరమని, కేటాగిరి–బీ పరిశ్రమలకు ప్రజాభిప్రాయ సేకరణ అవసరం ఉండదన్నారు. ఇథనాల్ కంపెనీ నుంచి పర్యావరణానికి ఎలాంటి ప్రమాదం లేదన్నారు. కంపెనీకి అవసరమయ్యే నీళ్లను నేరుగా జూరాల బ్యాక్ వాటర్ నుంచి తీసుకొస్తున్నామని, కోయిల్ సాగర్ వెళ్లే చుక్క నీరు తమకు అవసరం లేదన్నారు. అసైన్డ్ భూమి కంపెనీలో కలిపెసుకున్నామని చేస్తున్న ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని, వారి భూములని తేలితే స్వయంగా ఇచ్చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర, పర్యావరణ, నీటి పారుదల శాఖ అనుమతులు వచ్చిన తర్వాతనే పనులు ప్రారంభించామని స్పష్టం చేశారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధి కోసం పరిశ్రమలను తీసుకోస్తే వ్యతిరేకించడం న్యాయం కాదన్నారు. ఇక్కడ కంపెనీ వల్ల ప్రజలకు, వన్యప్రాణులకు ప్రమాదం లేదన్నారు. కంపెనీ పూర్తయితే ఈ ప్రాంతంలో 2వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

జోరందుకున్న ఉల్లి వ్యాపారం



తూకం వేసిన ఉల్లి బస్తాలను కొనుగోలు చేస్తున్న వినియోగ దారులు


దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరందుకుంది. ఉల్లి సీజన్ ప్రారంభం కావడంతో యాసంగి సీజన్ కింద వచ్చిన ఉల్లి దిగుమతులను రైతులు నేరుగా మార్కెట్‌కు తేవడంతో మార్కెట్ కళకళలాడింది. కొన్ని రోజులుగా సీజన్ లేక వెలవెలబోయిన మార్కెట్ బుధవారం ఉల్లి వ్యాపారంతో తిరిగి పుంజుకుంది. ఉదయం 10గంటల నుంచే కుప్పలు పోసిన ఉల్లిని వ్యాపారులు పోటీ పడి వేలంలో కొనుగోలు చేశారు. దాదాపు 500బస్తాలకు పైగా ఉల్లి రాగా, క్వింటాల్‌కు రూ.1,610, కనిష్ట ధర రూ.950 లభించాయి. 45 కేజీల బస్తా ధర గరిష్టంగా రూ.800, కనిష్టంగా రూ.500 వరకు విక్రయించారు. చిరు వ్యాపారులతో పాటు వినియోగదారులు పెద్ద ఎత్తున ఉల్లిని కొనుగోలు చేశారు.

పెరగని ధరలు..

మార్కెట్‌లో కొంత కాలంగా ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో తక్కువ మొత్తంలో ఉల్లి అమ్మకానికి వచ్చినప్పుడు కూడా ధరలు పెరగలేదు. ప్రస్తుతం సీజన్‌తో ఎక్కువ మొత్తంలో ఉల్లి అమ్మకానికి వస్తుంది. అయితే ధరలు మాత్రం అటు, ఇటుగానే ఉన్నాయి. కర్ణాటక, మహారాష్ట్రలలో పండిన ఉల్లి హైదరాబాద్ మార్కెట్‌కు వస్తున్నందున కొరత లేకపోవడంతో ధరలు పెరగడం లేదని వ్యాపారులు అంటున్నారు.

రాజకీయాల్లో కేటీఆర్ పిల్లవాడు

- పాలమూరు–రంగారెడ్డికి జాతీయహోదా తెస్తాం: ఏపీ జితేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు: దేశ ప్రధాని మోదీకి, తెలంగాణ మంత్రి కేటీఆర్ ఏమాత్రం సరిపోడని రాజకీయాల్లో మంత్రి కేటీఆర్ చిన్నపిల్లవాడని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ మీ వాక్చాతుర్యం ఎవరి మీద ప్రయోగిస్తున్నారో.. కొంత తెలుసుకొని మాట్లాడాలన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఓ సరైన డీపీఆర్ ఇచ్చారా మీరు అని ప్రశ్నించారు. ఓసారి జూరాల నుంచి మరోసారి నార్లపూర్ నుంచి ప్రాజెక్టు రూపొందించారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో కమీషన్ల కోసం రిజర్వాయిర్ కట్టిన చరిత్ర మీదేనని విమర్శించారు. గతంలో సీఎం కేసీఆర్ 299 టీఎంసీల నీళ్లు సరిపోతాయని ఉమాభారతి ఎదుట సంతకం పెట్టి, తెలంగాణ ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి 599 టీఎంసీల నీటిని సాధించకుంటామన్నారు. వీర బ్రహ్మచారి, ఎన్.పీ వెంకటేష్, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒంటె వాహనంపై అభయాంజనేయస్వామి



అభయుడి ఒంటె వాహన సేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు



ఆలయ ప్రాంగణంలో దుకాణాలు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహోత్సవాలలో భాగంగా స్వామి వారు ఒంటె వాహనంపై బుధవారం ఊరేగారు. బుధవారం బ్రహోత్సవాలలో భాగంగా భక్తులు స్వామివారి సన్నిధిలో వ్రతాలను నిర్వహించారు. ఒంటె వాహన సేవతో ఆలయంలో కీర్తనలతో ప్రాంగణమంతా అభయుడి నామస్మరణతో మారుమోగింది.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో దుకాణాలు కిటకిట లాడాయి.

నూతన విద్యావిధానంతో విద్యార్థులకు మేలు

- పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్



గుంత లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానంతో విద్యార్థులకు మేలు కలుగుతుందని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. పీయూలో ఐక్యూఏసీ ఏబీఆర్ఎస్ఎం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ విధానంలో విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధిని కల్పించే అంశాలను చేర్చారన్నారు. యోగా, క్రీడలకు పెద్ద పీట వేశారన్నారు. పీయూలో యోగా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాయింట్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో విద్యార్థికి పూర్తి స్థాయిలో న్యాయం కలిగే విధంగా నూతన విద్యా విధానం ఉందన్నారు. విజ్ఞానం, కళలు, వృత్తి, విద్య, అనేక అంశాలు ఇందులో మిళితమై ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, కుమారస్వామి, పవన్‌కుమార్, నూర్జహాన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడవిలో కార్చిచ్చుతో కొత్త జీవవైవిధ్యం అభివృద్ధి



అటవీశాఖ అధికారులు, సిబ్బందితో డాక్టర్ జయశ్రీరత్నం

అచ్చంపేట రూరల్: అడవుల్లో మంటలు ప్రమాదకరమేమీ కాదని, కార్చిచ్చుతో కొత్త జీవ వైవిధ్యం అభివృద్ధి చెందడంలో ఉపయోగపడుతోందని బెంగళూరు నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ డాక్టర్ జయశ్రీ రత్నం అన్నారు. బుధవారం పట్టణంలోని చౌసింగా హాలులో రాష్ట్ర అటవీశాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వు, కవాల్ టైగర్ రిజర్వు పరిధిలోని అటవీశాఖ అధికారులు, సిబ్బందికి అడవుల్లో రగిలే కార్చిచ్చు, యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్లమల అటవీ ప్రాంతాన్ని మిజిక్ సవాన్నాగా పిలుస్తారని, చెట్లు, విశాలమైన పచ్చికబయలు కలిగి ఉంటాయన్నారు. తక్కువ వర్షాపాతం నమోదయ్యే ఆకురాల్చు అడవులలో మానవ ప్రమేయం, ప్రకృతి కారణాల వల్ల కార్చిచ్చు రగిలే అవకాశం ఉందన్నారు. కార్చిచ్చు రగలగానే ఆర్పివేయకుండా దశల వారీగా మంటలను అదుపు చేస్తూ అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధిక నష్టం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, అక్బర్‌షరీఫ్, ఎఫ్‌డీఓ శ్రీనివాస్, రేంజ్ అధికారులు ఆదిత్య, రాజేందర్, ఈశ్వర్, శరత్‌చంద్ర, వీరేశం, ముజీబ్‌ఘోరి పాల్గొన్నారు.